అర్హులందరికీ ఓటు హక్కు

- పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించాలి
- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

మెదక్, మార్చి 12(నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వచ్చే పార్లమెంట్ ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీ ఎన్నికల ఏర్పాట్లపై హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్వో పద్మశ్రీ, మెదక్ ఆర్డీవో రమాదేవి, నర్సాపూర్ ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, మెదక్, నర్సాపూర్ తహసీల్దార్లు శ్రీనివాస్, కమలాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులకు వికాస్‌రాజ్ పలు సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన పోలింగ్ సిబ్బందిని సన్నద్ధం చేసుకొని వారికి శిక్షణ ఇవ్వాలన్నారు. ఈవీఎం యంత్రాల మొదటిస్థాయి చెకింగ్ నివేదికల సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తలను నిరంతరం పరిశీలించి అపోహలను నివృత్తి చేయాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణలో పెండింగ్ దరఖాస్తులను ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయో, లేదో తనిఖీ చేసుకోవాలని సూచించారు. మరణించిన వ్యక్తులు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లినవారి ఓటు వివరాలు నిబంధనల ప్రకారం తొలిగించాలన్నారు. నూతన ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, మంజూరైన ఓటర్ కార్డు వివరాలను వెంటనే సంబంధిత ప్రింటర్లకు అందజేయాలని అధికారులకు ఆదేశించారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్లు అధికారులు

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

మెదక్, మార్చి 12(నమస్తే తెలంగాణ): జిల్లాలో మంగళవారం ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం భౌతిక శాస్త్రం -II, అర్థశాస్త్రం-II పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జనరల్ విభాగంలో 5,523 మంది విద్యార్థులకు 5,271 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 531 మందికి 510 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, హాజరు 95 శాతం నమోదైంది. నిమిషం నిబంధన అమలులో ఉండటంతో విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలోని చిన్నశంకరంపేట్, చేగుంట, రామాయంపేటలోని నాలుగు పరీక్ష కేంద్రాలను ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ, కొల్చారం, కౌడిపల్లి, నర్సాపూర్‌లోని నాలుగు కేంద్రాలను జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు శశిధర్, అశోక్, పాపన్నపేట, టేక్మాల్, అల్లాదుర్గ్, పెద్దశంకరంపేట కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్లు పర్యవేక్షించారు.

అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపట్టొద్దు

నర్సాపూర్, మార్చి 12 : అసైన్డ్ భూముల్లో నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నర్సాపూర్-మెదక్ రోడ్డులో 731 సర్వేనంబర్‌లోని అసైన్డ్ భూముల్లో వాణిజ్యపరమైన నిర్మాణాలు చేపట్టిన 14 మందికి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్నవారు 15రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. ఎవరైనా అసైన్డ్ భూము ల్లో నిర్మాణాలు చేపడితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అసైన్డ్ భూములను సాగు చేసుకొని జీవించాలి, తప్పా నిర్మాణాలు చేపట్టరాదని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సూచించారు.

కాళేశ్వరం కాలువల పనులు చేపట్టొద్దు

నర్సాపూర్, మార్చి 12 : కాళేశ్వరం ప్రాజెక్ట్ నుంచి కొండపోచమ్మ సాగర్, సంగారెడ్డికి వెళ్లే కాళేశ్వరం సాగునీటి కాల్వ రీచ్-2 నిర్మాణాన్ని వెంటనే రద్దు చేయాలని భూములు కోల్పోతున్న మనోహరాబాద్, శివంపేట, నర్సాపూర్ మండలాల రైతులు మంగళవారం ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళేశ్వరం కాల్వ పూర్తిగా హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తుందని, ఆర్ఆర్ఆర్ లోపల గ్రామాలు ఉండడంతో భవిష్యత్‌లో పట్టణీకరణ దిశగా అభివృద్ధి జరుగుతుందని, కాబట్టి కాళేశ్వరం సాగునీటి కాల్వ నిర్మాణాన్ని రద్దు చేయాలని కోరారు. కాల్వ ఆయకట్టు ఉన్న 56 గ్రామాలు వచ్చే 5 నుంచి 10 ఏండ్లలో పట్టణీకరణతో వ్యవసాయానికి బదులు వ్యాపారం, వాణిజ్యం పరంగా అభివృద్ధి చెందుతాయన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు నర్సింహారెడ్డి, ప్యాట మహేశ్‌గౌడ్, పెంటయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

అనారోగ్యంతో ఆత్మహత్య

నిజాంపేట, మార్చి 12: అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చల్మెడలో మంగళవారం జరిగింది. చల్మెడకు చెందిన బ్యాగరి భూదయ్య(43) ఆరు నెలల నుంచి అల్సర్‌తో బాధపడుతున్నాడు. ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందినప్పటికీ వ్యాధి నయం కాకపోవడం, అదే క్రమంలో మంగళవారం తీవ్రమైన నొప్పి రావడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి రామవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

డ్రైవర్ ఆత్మహత్య

★ తలకొరివి పట్టిన కూతురు

రామాయంపేట, మార్చి 12: మనస్తాపంతో ట్రాక్టర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం.. కేసీఆర్ కాలనీకి చెందిన సాదుల నర్సింహులు(34) కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స కోసం దవాఖానల్లో అధిక డబ్బులు కావడం, కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య భాగ్య, కూతురు అంజలి ఉన్నారు. నర్సింహులు సొంత గ్రామం భిక్కనూరు మండలం భగీరత్‌పల్లి గ్రామంలో కూతురు తలకొరివి పెట్టింది. కుటుంబీకుల ఫిర్యాదుతో ఎస్సై రంజిత్ కేసు నమోదు చేశారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

తలకొరివి పట్టిన తనయ అంజలి

పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు

చీలపల్లిలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

- ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి
- పెద్దశంకరంపేట మండలంలో వివిధ పనులకు శంకుస్థాపన

పెద్దశంకరంపేట, మార్చి 12: ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం చీలపల్లి, ఉత్తులూరు, శివయపల్లి, దానంపల్లి, మూసాపేట, భూర్గుపల్లి గ్రామాల్లో సుమారు రూ.1.40కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ప్రతి పథకం ప్రతి పేదవాడికి అందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నదన్నారు. ఇందిరమ్మ పథకంలో నియోజకవర్గానికి 3,500 గృహాలు మంజూరయ్యాయని తెలిపారు. మండల పరిధిలోని భూర్గుపల్లి కోటమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాయిని మధుసూదన్, దానంపల్లి నారాయణగౌడ్, రాజేందర్‌గౌడ్, జనార్దన్, పెరుమాల్‌గౌడ్, సంగమేశ్వర్, సత్యనారాయణ, దేవేందర్, కుంట్ల శ్రీనివాస్, దశరత్, శంకరయ్య, సాయిరెడ్డి ఉన్నారు.

వైభవంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం

పెద్దశంకరంపేటలో బండ్ల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పెద్దశంకరంపేట, మార్చి 12: పెద్దశంకరంపేట పట్టణ శివారులోని కట్టమైసమ్మ గురుపాదగుట్ట శివాలయ ఆవరణలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పార్వతీ, పరమేశ్వరుడి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలకు వేద బ్రాహ్మణులు కల్యాణం జరిపించారు. ఈ కార్యక్రమానికి మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్లబండ్ల ఊరేగింపు ఆకట్టుకుంది. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఆలయ ధర్మకర్త బల్‌రాం సంగమేశ్వర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు, పద్మశాలీ సంఘం మండలాధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, ఎంపీటీసీ వీణాసుభాశ్ గౌడ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాగులమ్మ ఆలయంలో పూజలు

రామాయంపేట, మార్చి 12 : రాయమాయంపేటలోని నాగులమ్మ ఆలయంలో సంఘ సేవకుడు శీలం లింగారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పాండుచెరువు కట్టపై నాగులమ్మ ఆలయ ద్వాదశ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

వరి పైరును పరిశీలించిన శాస్త్రవేత్తలు

సూరారంలో వరి పంట పరిశీలన

చిన్నశంకరంపేట, మార్చి 12 : మండల పరిధిలోని సూరారం గ్రామానికి చెందిన కౌలురైతు శ్రీశైలం ఫిబ్రవరి 26న నాలుగున్నర ఎకరాల్లో వరికి మొగి పురుగు సోకిందని చిన్నశంకరంపేటలో పురుగు మందుల దుకాణంలో మొగి పురుగు నివారణకు మందు తీసుకువచ్చి వారి సూచన మేరకు పిచికారీ చేశాడు. కొద్ది గంటల్లోనే రెండు ఎకరాల్లో వరి వాడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రవీణ్‌కు ఫిర్యాదు చేయగా ఆయన వచ్చి పంటను, మందు సీసాలను పరిశీలించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రవి, ప్రతాప్ వరి పంటను పరిశీలించి నమూనాలు సేకరించారు. రైతు పిచికారీ చేసిన మందు యూనివర్సిటీ ధృవీకరించిందని, దానితో పంట వాడిపోలేదని తెలిపారు. కలుపు మందు ద్వారానే పంట అలా అయిందని నిర్ధారించారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని, ఆరుతడి పంటలు, పంట మార్పిడి ద్వారా భూసారం పెరుగుతుందని చెప్పారు. వారి వెంట ఏవో లక్ష్మీప్రవీణ్ ఉన్నారు.

మైనంపల్లి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న వ్యాపారవేత్త దారం సంతోష్

రామాయంపేట, మార్చి 12: రామాయంపేట పట్టణంలోని ప్రముఖ వ్యాపారి దారం రమేశ్ కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం రామాయంపేటకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అక్కడి నుంచి మైనంపల్లి మండల పరిధిలోని డి.ధర్మారం గ్రామంలోని మల్లికార్జున స్వామి ఆలయ వార్షికోత్సవాలకు హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, అల్లాడి వెంకటి, కోనాపూర్ సిద్ధిరాములు, చింతల స్వామి, ఉడుత రాజేశం తదితరులు ఉన్నారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం

ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

చిన్నశంకరంపేట, మార్చి 12: పేదలకు సేవ చేయడమే లక్ష్యంగా మైనంపల్లి స్వచ్ఛంద సంస్థ స్థాపించామని సంస్థ వ్యవస్థాపకుడు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మంగళవారం రామాయపల్లిలో తల్లీతండ్రి లేని ఐదుగురు పిల్లలకు రూ.25 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేశారు. నేటికీ ప్రతీ గ్రామంలో బోరుబావి, గుడి నిర్మాణానికి డబ్బులు అందించామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నిచర్ సమకూర్చామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు గోపాల్‌రెడ్డి, అరుణ, ప్రభాకర్, సిద్ధిరాములు, శ్రీనివాస్, మనోజ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఫోన్‌కు దూరంగా ఉండాలి

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత

విద్యార్థినుల నృత్య ప్రదర్శన

చేగుంట, మార్చి 12: విద్యార్థులు ఫోన్‌కు దూరంగా ఉండాలని కృష్ణావేణి పాఠశాల కరస్పాండెంట్ చంద్రశేఖర్, డైరెక్టర్లు పులబోయిన నాగరాజు, లింగమూర్తి, రామకృష్ణ అన్నారు. చేగుంట మండలకేంద్రంలోని శ్రీకృష్ణవేణి పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు నాగరాజు, లింగమూర్తి, రామకృష్ణ, పాఠశాల ప్రిన్సిపాల్ వివేకవర్ధన్, వైస్ ప్రిన్సిపల్ రెహమాన్, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, రజిని పాల్గొన్నారు.

చెరువులో పడి బాలుడి మృతి

చిన్నశంకరంపేట, మార్చి 12: ప్రమాదవశాత్తు చెరువులో పడిన బాలుడు దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఎస్సై నారాయణ కథనం.. మడూరు గ్రామానికి చెందిన రేణుక, సురేశ్ దంపతులు కూలీ చేసుకుంటూ జీవిస్తున్నారు. తల్లితో కలిసి కుమారుడు మోక్ష(12) గ్రామంలోని చెరువు వద్దకు బట్టలు ఉతకడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు మోక్ష చెరువులో పడిపోయాడు. తల్లి కేకలు వేయడంతో స్థానికులు మోక్షను సిద్దిపేట జిల్లా ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు. సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి సురేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరండాలో 'ప్రసవం'పై విచారణ

- నివేదిక ఇవ్వాలని ఆదేశించిన జిల్లా వైద్యాధికారి చందూనాయక్

వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానలో సిబ్బందిని విచారిస్తున్న వైద్యాధికారులు

వెల్దుర్తి, మార్చి 12: మండల కేంద్రమైన వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానకు పురిటి నొప్పులతో ఆదివారం అర్ధరాత్రి వచ్చిన గర్భిణి వరండాలో ప్రసవించడంపై జిల్లా వైద్యాధికారి చందూనాయక్ స్పందించారు. అదనపు డీఎంహెచ్‌వో విజయనిర్మల, డిప్యూటీ డీఎంహెచ్‌వో అరుణశ్రీలకు విచారణ బాధ్యతను అప్పగించి మంగళవారం వెల్దుర్తి ప్రభుత్వ దవాఖానకు వచ్చారు. ఈ సందర్భంగా రాత్రి విధుల్లో ఉన్న ఏఎన్ఎం జయంతితో పాటు దవాఖాన డాక్టర్ సౌజన్యలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరండాలో ప్రసవం జరగడానికి గల కారణాలు, జరిగిన విధుల నిర్లక్ష్యంపై విచారణ జరిపారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. రోజూ విధులు నిర్వహించాల్సిన స్టాఫ్ నర్సులు వారాంతపు సెలవులో ఉండడంతో ఏఎన్ఎం విధులు నిర్వహించాల్సి వచ్చింది. రాత్రి విధులకు రావాల్సిన అటెండర్ రాత్రి11.30 గంటలైనా రాకపోవడంతో దవాఖానలో మహిళా ఏఎన్ఎం ఒక్కరే ఉండలేక వారి భర్తకు సమాచారం అందించి రావాలని కోరింది. తాను వచ్చే వరకు దవాఖానకు సమీపంలో ఉన్న మరో ఏఎన్ఎం ఇంట్లో ఉంది. ఈ సమయంలోనే పురిటి నొప్పులతో గర్భిణి వచ్చింది. లోపలికి తరలిస్తుండగా ప్రసవం కావడంతో ఏఎన్ఎం జాగ్రత్తగా నార్మల్ డెలివరీ చేసిందని వివరించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారన్నారు. గతంలో ఉన్న మహిళా ఆయాలకు వయసు 61 దాటడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వారిద్దరిని విధుల నుంచి తొలిగించినట్లు తెలిపారు. దీంతో రాత్రి వేళల్లో మహిళా ఉద్యోగి ఒక్కరే దవాఖానలో ఉండాలంటే ఇబ్బందిగా ఉన్నదని, సిబ్బంది తమ దృష్టికి తీసుకురాగా రాత్రివేళల్లో ఇద్దరు సిబ్బంది ఉండేలా షెడ్యూల్ రూపొందించమని ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానలో సిబ్బంది కోసం గ్రామపంచాయతీ నుంచి తీర్మానం చేయాల్సిందిగా పంచాయతీ అధికారులను కోరినట్లు తెలిపారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లతో అదనపు డీఎంహెచ్‌వో విజయనిర్మల, డిప్యూటీ డీఎంహెచ్‌వో అరుణశ్రీ సమావేశం అయ్యారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

క్రీడాకారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రతిభావంతులైన క్రీడాకారులకు నెలవు

- కలెక్టర్ రాహుల్ రాజ్
- సైక్లింగ్ క్రీడాకారులకు అభినందన

మెదక్, మార్చి 12(నమస్తే తెలంగాణ): ప్రతిభావంతులైన క్రీడాకారులకు నెలవు మెదక్ జిల్లా అని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో రామాయంపేట్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీల్లో జిల్లాలోని ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ నుంచి ఆరుగురు క్రీడాకారులు బంగారు, వెండి, రజత పథకాలు సాధించారు. వారిని మంగళవారం కలెక్టరేట్‌లో అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖేలో ఇండియా సైక్లింగ్ సెంటర్ క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో కూడా రాణించి జిల్లా పేరును భారతదేశ పటంలో ముందు వరుసలో ఉంచాలని శిక్షకుడు యాదగిరికి సూచించారు. క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 25 వరకు హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి నాగరాజు, సిబ్బంది రాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రేషన్ డీలర్లు


కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో రేషన్ డీలర్లు

మెదక్, మార్చి 12 (నమస్తే తెలంగాణ): జిల్లాకు నూతనంగా వచ్చిన కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మంగళవారం రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

వన్ స్టేషన్, వన్ ప్రోడక్ట్ ప్రారంభం


అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో వన్ స్టేషన్, వన్ ప్రోడక్ట్‌ను ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

రామాయంపేట రూరల్, మార్చి 12 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వందే భారత్ తోపాటు వన్ స్టేషన్, వన్ ప్రోడక్ట్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామాయంపేట మండలం అక్కన్నపేట రైల్వే స్టేషన్‌లో రైల్వే శాఖ అధికారులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ స్టాల్‌లో తెలంగాణలో ప్రయాణికులకు ఇష్టమైన పిండి పదార్థాలు, ఇక్కడి ప్రాంతంలో ఎక్కువగా తినే తినుబండారాలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రైల్వేశాఖ హైదరాబాద్ డివిజన్ సీనియర్ ఇంజినీర్ శ్రీతేజ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనులకు భూమిపూజ

కుకునూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ రమేశ్‌గౌడ్

వెల్దుర్తి, మార్చి 12: గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రయాణం సులువు అవుతుందని జడ్పీటీసీ రమేశ్‌గౌడ్ అన్నారు. మంగళవారం వెల్దుర్తి మండల పరిధిలోని ధర్మారం, దామరంచ, కుకునూర్, యశ్వంరావుపేట, బస్వాపూర్, రామాయిపల్లి, శెట్‌పల్లి, బండపోసాన్‌పల్లి గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణాలకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్ సర్కార్ పెద్దపీట వేసిందని, గ్రామాల్లో చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల రూపురేఖలు మారాయన్నారు. గ్రామాల అభివృద్ధిలో రోడ్డు ఎంతో కీలకమని, రోడ్ల నిర్మాణాలతో వర్షాకాలంలో ఇబ్బందులు తొలిగిపోతాయన్నారు. కార్యక్రమాలలో ఆయా గ్రామాల నాయకులు మహేందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సత్యంగౌడ్, అశోక్‌గౌడ్, శేఖర్, నర్సింహులు, గోపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన

రేగోడ్, మార్చి 12: మండల పరిధిలోని జగిర్యాల గ్రామంలో యాసంగి పంటలను మంగళవారం ఏవో జావిద్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జొన్న, వరి పంటలను పరిశీలించిన అనతరం ఆయన మాట్లాడుతూ జొన్న పంటలో మొవ్వు తొలుచు పురుగును గుర్తించినట్లు తెలిపారు. వీటి నివారణకు క్లోరంత్రానిలిప్రోల్ మందుకు ఎకరాకు 80 ఎంఎల్/200 లీటర్స్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరిలో కాండం తొలుచుపురుగు(మొవ్వు పురుగు) ఈ దశలో ఎక్కువగా ఆశిస్తుందని, దీని నివారణకు కాప్టర్ హైడ్రా క్లోరైడ్ 4జీ గుళికలు 8కేజీ/ఎకరాకు లేదా కాప్టర్ హైడ్రా క్లోరైడ్ 2గ్రా/లీటర్ నీటికి, 19:19:19 అనే రసాయన మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈవో వినిత్‌కుమార్, రైతులు దుర్గయ్య, తదితరులు ఉన్నారు.

రైతుల శ్రేయస్సుకు 'రైతు నేస్తం'

రామాయంపేట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

రామాయంపేట, మార్చి 12: రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా, డివిజన్ స్థాయిల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోవింద్, రామాయంపేట వ్యవసాయశాఖ డివిజన్ సహాయ సంచాలకు రాలు వసంతసుగుణ అన్నారు. మంగళవారం రామాయంపేట రైతువేదికలో రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటల వివరాలు, సాగు పద్ధతులు వివరించారు. వివిధ రకాల పండ్ల తోటల సాగు, రసాయనిక ఎరువుల వాడకం, విత్తన ఎంపికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామాయంపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట మండలాల ఏవోలు రాజ్‌నారాయణ, యాదగిరి, సతీశ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.